# మెతుకులు

దాట్ల నారాయణమూర్తి రాజు

అక్కడ గాలిలో సువాసనలు లేవు. అక్కడ నేల పసందుగా, అందంగా లేదు. అక్కడ ఎత్తైన మేడలు లేవు. అక్కడ మనుషులు మనుషుల్లా లేరు. అక్కడ బతుకుతున్న బతుకు బతుకులా లేదు.

అక్కడ గాలి దూరంగా ఉన్న పబ్లిక్ పాయిఖానాల వాసనని మోసుకొస్తోంది. అక్కడ నేల బురద బురదగా, మడ్డిగా, అసహ్యంగా తరతరాల వనాన చీకటి చరిత్రకు నిదర్శనంగా ఉంది. అక్కడ గుడిసెలు పుట్టుకతో వికలం ఒడిపోయిన పోలియో పిల్లల్లా ఉన్నాయి. అక్కడ మనుషులు ఒంటి నిండుగా బట్ట లేక, కంటి నిండుగా నిద్రలేక, కడుపు నిండుగా తిండిలేక పుచ్చిపోయిన కట్టెకర్రల్లా ఉన్నారు.

ఆ మహాపట్నంలో పెద్ద బజారుకి రెండు కిలో మీటర్ల దూరంలో పూర్ణోని చెత్తనంతా ఒక మూల పోసినట్టుగా అసహ్యంగా, అసభ్యంగా, అనాగరికంగా, అస్తవ్యస్తంగా నాగరిక ప్రపంచం చూడ్డాని క్కూడా ఇష్టపడని ప్రదేశంలాగే ఉంది ఆ మురికి వాళ్ళ నివాస స్థలం.

ఇప్పుడు ఆ గుడిసెల ముందర మనుషు లెవరూ లేరు. పందులు గజ్జికుక్కలు గుర్రు పెడుతూ, బురదని నాకుతూ, గుడ్డపీకల్ని లాక్కుంటూ ఉండుండి అరుస్తున్నాయి. ఆ గుడిసెలకు కొంచెం దూరంలో ఒక పడిపోయిన భవనం ఉంది. అది ఎన్నేళ్ళ నాటిదో, ఏ జమీందారుదో, ఏ రాజాగారి విహార మందిరమో కానీ—ఈ నాడు అలనాటి రాజరికపు అహంకారంలాగే, రసిక్యతలాగే, జారిపోయి, గోడలు కూలిపోయి దిక్కుమాలిన ఒక వ్యవస్థకు సజీవ చిహ్నంలాగే ఉంది. ఆ భవనానికి వెనకపక్క రెండు గోడల మధ్య పైన రేకులు వేయడం వలన అది ఓ గదిలా ఉంది. ఆ గదిలో ఒక మూల నాలుగు సత్తు పళ్ళాలు, రెండు ఎండుటాకుల్లా ముడుచుకు పోయిన గ్లాసులు, ఒక చీపురుకట్ట, మురికి మురికి గుడ్డలు, నులక తెగిపోయిన ఒక మంచం, కాళ్ళు విరిగిన క్రరబల్ల. సగానికి పూడిపోయిన ప్లాస్టిక్ బకెట్ ఉన్నాయి.

ఆ గదిలో పైనున్న కర్రలకి వేలాడదీసిన ఒక ఉయ్యాల ఉంది. చిరిగిపోయిన చీర ఉయ్యాలలో చీకూ చింతలూ లేకుండా హాయిగా నిద్రపోతోంది ఓ పాప. ఆ పాపకు ఆర్నెల్లుంటాయి. ఆ పాప పాపలాగా లేదు. నల్లగా భోగిమంటల్లో పడి సగం కాలిపోయిన ఇత డి ముక్కలా ఉంది. సన్నగా కాళ్ళు. మెడకి నల్లటి తాడు, ముఖానికో పెద్ద కుంకుమ బొట్టు. ముడుచుకుపోయిన లేత ఆకుల్లా చేతులు. వేళ్ళను ముడుచుకుని గుండె మీద వేసుకుని నిద్రపోతోంది పాప.

చీర ఉయ్యాల ఊగుతోంది. ఊగుతున్న ఆ ఉయ్యాలకు ఎడమ వేపుకి కొంచెం దూరంలో ఒక ఆకారం. ఆ ఆకారం గోడకిరవే బడి కాళ్ళు జాపుకుని గుడిసెల వేపుకి చూస్తూ ఉయ్యాల ఊపుతోంది. మధ్య మధ్యన రావకొస్తున్న కుక్కల్ని కసురుతూ కైటకు అరుస్తోంది.

ఉయ్యాల ఊపుతున్నప్పుడు ఆ ఆకారం చేతి కున్న మట్టి గాజులు చిన్న శబ్దం చేస్తున్నాయి. ఆ చేతులు నల్లగా గొంగళి పురుగుల్లా ఉన్నాయి. వేసుకున్న బూడిద రంగు జాకెట్టుకి ఒక వేపు చెయ్యి ఊడిపోయింది. జాకెట్టు వెనక ముందు పెద్ద పెద్ద చిరుగులు. ఎన్నోసార్లు కుట్టినట్టుగా, కుట్టిన అతుకులు కూడా ఊడిపోయి వేలాడుతున్నాయి. వెలిసిపోయిన చీర మోకాళ్ళవరకూ ఉంది. చీర ఒక్కటే ఆమె శరీరానికున్న ఒకే ఒక్క అచ్ఛాదన. సగానికి సగం చిరిగిపోయిన ఆ చీర శరీరాన్ని కప్పిన సంతృప్తిని మాత్రమే ఆమె కిస్తోంది.

ఆమె ముఖం సన్నగా, కోలగా వొక్కేసిన రేకు డబ్బాలా ఉంది. ఆమె కళ్ళు ఉబ్బిపోయిన కళ్ళలా ఉన్నాయి. ఆ కళ్ళలో చూపులున్నాయి కానీ, ఆ చూపులు నీరసంతో కలిసిపోవడం వల్ల ఆ చూపులో చూపుల్లా లేవు. ఆమె జుత్తు నల్లగా ఉండేదేమో కానీ ఇప్పుడలా లేదు. పుచ్చేసిన కొరాకిళ్ళ ఎండిపోయినప్పుడు కనిపించే పెళుసుతో, మకిలిపట్టి వుంది ఆమె జుట్టు. నిలబడితే ఆమె నల్లరంగు వేసిన రాటలా ఉంటుంది.

సమయం ఎంత అయిందో తెలియదు. వేసంకాలం అవడం వల్ల ఎండ తీక్షణంగా ఉంది. పక్కన సగం నిండిన పెద్ద చెరువు మధ్య లో ఉన్న రాళ్ళమీద రాబందులు కూర్చున్నాయి. ఆ పక్కన శ్మశానంలో ఎవరిదో శవం మండుతోంది. ఎముకలు చిటుగుతున్న చప్పుడు. కాలుతున్న చర్మం వాసన గాలిలో నిండి గుడిసెల చుట్టూ తిరుగుతోంది.

ఆ గుడిసెలకు ఎడం పక్కకున్న ఆయిల్ మిల్లు లోంచి సైరన్ పెను కేకలా వినబడింది. ఆ శబ్దానికి ఉయ్యాలలోని పిల్ల లేచి ఏడవడం ప్రారంభించింది. ఆ ఏడుపు ఏడుపులాగా లేదు. ఏ బండిచక్రం కిందో కాలుపడి నలిగిపోతే గిజగిజకొట్టే పంది పిల్ల అరుపులా ఉంది.

గోడకి చేరబడి కనులు మూసుకున్న ఆ తల్లి గబుక్కున కళ్ళు తెరిచింది.

"మూదినష్టపు గుంట లేచి పోవాది..." అన్లో తను అనుకొని ఉయ్యాలని ఇంకా గట్టిగా ఊపింది. ఆ పిల్ల ఏడుపు మానలేదు. పేగులన్నింటినీ కూడ తీసుకుని ఏడుస్తోంది. ఆ తల్లి లేచి ఉయ్యాలలోని పిల్లని తీసుకుని మళ్ళీ గోడకి చేరబడి కూర్చుంది. ఆ పిల్ల చేతులు పాలకోసం వెతుకుతున్నాయి.

"ఇహ్ నానే ... గంట నమ్మి" ఆ తల్లి విసుక్కుంది. గుండీలు లేని జాకెట్టుని పైకి తీసుకుంది. ఎండిపోయిన రొమ్ములు తోలుముక్కల్లాగే ఉన్నాయి. ఆ తోలు ముక్కల్లో ఓ తోలుముక్కని ఆ పిల్ల నోట్లో పెట్టింది ఆ తల్లి. ఆకలి తీరదని తెలీదు. అయినా ఆ పిల్ల ఏడుపు మానేసి చప్పుడు చేస్తూ చీకుతోంది.

పావుగంట గడిచింది. పిల్ల నీరసంతో ముడుచుకు పోయి నిద్రపోయింది. పిల్లదాన్ని మళ్ళీ ఉయ్యాలలో పడేసింది తల్లి.

నిలబడి చుట్టూ చూసింది. అప్పుడా తల్లికి కుంటి రావులు కనబడ్డాడు. ఆడు కర్రని ఊతగా చేసుకుని, ఒక కాలుని ఎగరేస్తూ నడుస్తూ ఆయాసంతో వచ్చి ఓ గుడిసె ముందు కూర్చున్నాడు.

"ఓరోరి కుంటిగా ... తిండి దొరికిందేట్రా?" ఆడి దగ్గర కెళ్తూ అడిగిందా తల్లి.

"పెడిన. తిండి నేకపోతే సచ్చిపోతావేటే, నంజా"

"నా క్కాదరా. గుంటలకి." ఆడి దగ్గరున్న చిక్కాం వేపు ఆశగా చూస్తూ అన్నాది ఆ తల్లి.

కుంటి రావులు చిక్కాంలో చెయ్యి పెట్టి అటు తిప్పి, ఇటు తిప్పి, దాన్ని తలకిందులుగా చేసి దులపరించి పదిహేను పైసల్ని కూడదీశాడు. అప్పుడాడు ఆ తల్లి వేపు చూస్తూ ఇలా అన్నాడు.

"సూడే, లచ్చి! లోకంల ధరమం నా నాగే కుంటిదయిపోనాది. రైలు స్టేషన్ కాడ పొద్దు టేలనించి కాపు కాసినా. చిక్కిన కాని డబ్బులియ్యే." అర చేతిలో పదిహేను పైసల్ని చూపిస్తూ అన్నాడు రావులు.

"అయ్య నా కిచ్చిర" అడగబోయింది లచ్చి. అడగలేక పోయింది. ఆడి వేపు చూస్తూ ఆ పక్కన కూర్చుంది.

"పెద్ది పొదూగోడు రానేదా?" రావు అడిగాడు.

"గుడ్డి సొదూ రానేదు. గుంటలూ రానేదు. పైడమ్మతో ఎళ్ళేరు. గుంటలు ఎక్కడేడుస్తున్నారో ...ఏటో."

"గుడి సొదు వొచ్చినా బావుణ్ను. ఆడి దగ్గర నాలుగు డబ్బులు రాలతాయి. గుడ్డోడు కదా. ఆణ్ణి చూస్తే అందరికీ కనికారం. అందుకే సెప్తాను. పిల్లదాన్ని..." ఆడేదో అనబోయాడు.

లచ్చి అక్కణ్ణించి లేచిపోయింది.

"దిక్కుమాలిన నంజికొడకా! నా గుంటకు ఆ కరమ మేం పట్టదు. నీ రెండు కళ్ళూ కుళ్ళ బోడి చేసుకుని అడుక్కోరా." విసురుగా అంటూ వెనక్కొచ్చింది.





కుంటి రావులు వచ్చాడు. ఆడు నవ్వుతుంటే పళ్ళు లేని ఆడు నోరు వికృతంగా తోలు డబ్బాలా ఉంది.

"కుంటోన్నయినా పెపంచకానికి దయలేదు. గుడ్డోన్నైతే కనికారం కారతాదేటే. నీ వాంటి దైతే కబోదివైనా. కుంటి దానివైనా ఆడదానివి కాబట్టి ఇంటినిండా కనకవే, లచ్చీ."

"నోరు ముయ్యరా. కళ్ళుండికూడా గుడ్డిదాన్ని సేసేశావు. నేకపోతే." లచ్చి కళ్ళు విషాదంగా కుంటి రావులు వేపు చూశాయి. ఆడు దానివేపు చూడడం లేదు. లేచే ప్రయత్నంలో ఉన్నాడు. అప్పుడాడిలా అన్నాడు.

"వూరుకోయ్, పతివ్రతా! పెద్ద గుంటడు పకీరుగాడికి బుట్టేడు. రెండో గుంట గుడ్డి సాయిగోడికి పుట్టింది. సిగురుగుంట నాకు బుట్టిందంటున్నావు. ఎవరికెరిక. నువ్వేం పెంచీయాల. పోషికారం సేసీయాల. .అందుకే దాన్ని నా కిచ్చీమంటున్నాను. దాన్ని నా కిచ్చేస్తే పాతిక.. పాతికరూపాయ లిస్తాను. మాసుకో. లచ్చి. లచ్చివి లిచ్చిసుకోకు."


కుంటిరావులు కర్రని సర్దుకుని, కాలుని ఎగరేసు కుంటూ ఎండన బడ్డాడు.

లచ్చి గోడకి చేరబడి కూర్చుంది.

దూరంగా రైల్వేస్టేషను కెళ్ళే రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. అప్పుడప్పుడు కార్లు, లారీలు వేగంగా పోతున్నాయి. లచ్చి ఆశగా చూస్తాంది. ఎవరైనా వస్తారని. బయట కెళ్ళిన ఒక్కడూరాలేదు. ఎప్పుడో మొన్న రాత్రి తిన్న రొట్టెముక్క. నిన్నుదయం తాగిన పదిహేను పైసలటీయ్య. అంతే.

ఆకలి.

లచ్చి చెయ్యి ఒక్కసారి కడుపు మీదకు వెళ్ళింది.




బాధగా ఎడం చేత్తో కడుపు నంతా ఒక్కసారి గట్టిగా పట్టి నొక్కుకుంది. వుయ్యాల్లో పిల్ల వేపు ఒక్కసారి చూసి, లేచి బైటి కొచ్చింది. రైల్వే స్టేషను వేపు నడుస్తోంది.

ఎండ దేశంలో దరిద్రంలా ఉంది. ఎన్ని పథకాలు, ఎన్ని ప్రణాళికలు వేసినా ఏ మాత్రం మార్పు లేని 'దిక్కుమాలిన జనం' బతుకుల్లాగే రోడ్డుమీద తారు మరుగుతూంది. కాలు నేల మీద వెయ్యడానికి భయంగా ఉంది. వెచ్చటి గాలి విసురుగా ఉంది. గబగబా నడుచుకుంటూ రైల్వే స్టేషన్ ముందున్న మర్రిచెట్టు ముందుకు నడిచింది లచ్చి.

అక్కడ చల్లగా ఉంది. ఆ చల్లదనం మహానాయకురాలి వాగ్దానాల చలివేంద్రంలా చక్కగా ఉంది. ఆ పక్కన రెండు జమ బడ్డీలున్నాయి. ఆ వెనక కిళ్ళీ బడ్డీలు. పళ్ళ దుకాణం. ఒక పక్క ఏవేవో గాజుల దుకాణాలు, రెండో పక్క రైల్వేవాళ్ళ కేంటీను. దూరంగా పాత బస్టాండు. వచ్చి పోయే బస్సుల రొద.

జమ బడ్డీ పక్కన నిలబడింది లచ్చి. జమ బడ్డీవాడు ఖాళీగా ఉన్నాడు. వాడు లచ్చి వేపు చూశాడు. ఆ సమయంలో లచ్చి వాడివేపు చూసి నవ్వింది.

"షరబత్తిస్తావా. డబ్బులు రేపిస్తాను." ఆశగా చూస్తూ అడిగింది.

వాడు పలకలేదు.

మళ్ళీ అడిగింది లచ్చి:

"అసలే బేరా ల్లేవు. వుల్సా బేరాలైతే నెత్తి మీద కొంగేసుకోడవే. డబ్బులేస్తే. ఇస్తాను" విసుగ్గా అన్నాడు వాడు.

"డబ్బుల్లాసేతన్నావేటి సైడమ్మకు. దానెత్తు గుండెలు, వయ్యారాల మాసి ఇస్తున్నావు గాని". ఉడుకుమోత్తనంగా దీర్ఘం తీస్తూ అన్నాది లచ్చి.

"అయ్యో మాసి. ఇత్తన్నాను. ఏటంటావేటి"

"జమ నీళ్ళున్నా. ఇయ్యిరా." గాజు గ్లాసుని ముందుకు తోస్తూ అన్నాది లచ్చి.

"అంతగా దాహమేస్తే ఈ నీళ్ళు తాగు. ఐపోకటా." సీసాలోని నీళ్ళను గ్లాసులో పోశాడు. లచ్చి గడగడా తాగేసింది. గ్లాసుని చప్పుడయ్యేటట్టు పెడుతూ "మగ నా కొడుకులు. దొంగ నాకొడుకులు." వాడికి వినపడేటట్టు గానే అంది. ఆ మగ నా కొడుకేం చలించ లేదు. బీడీ తీసుకుని వెలిగించుకునే ప్రయత్నంలో వాడు వోరగా దాని పిరుదుల వేపు చూస్తున్నాడు.

ఎక్కువవుతున్న ఎండలాగే ఉంది ఆకలి. సన్నగా ప్రారంభమై ఎముక ముక్కని కొరికే కుక్క పళ్ళన్నింటా కరకర మంటూ కడుపులో నరాల మంట. అటూ ఇటూ చూస్తూ గుడిసెల వేపు వస్తోంది లచ్చి.

దూరంగా సినిమా థియేటర్ దగ్గర టిక్కెట్ల కోసం జనం కుమ్ములాడుకుంటున్నారు. ఆ పక్క ప్రభుత్వ సారాదుకాణం లోంచి బయటి కొచ్చిన ఒక భారతీయ పౌరుడు ఏడుస్తున్నాడో, పాడుతున్నాడో తెలీకుండా అరుస్తున్నాడు.

రోడ్డుకి రెండు వేపులా అంతెత్తు పెంటకుప్పలు. ఆ పక్కన కాలువ వారన వరసగా

కుక్కపిల్లలు పొర్లుతున్నాయి.

లచ్చి అప్పుడు అటు వేపు చూసింది. కాలవకి పెంట కుప్పలకు మధ్యన కుళ్ళి పోయిన బత్తాయి పళ్ళు. జోరుగా అటు నడిచింది. వంగొని మరీవనికి రాని పళ్ళు వదిలేసి, సగం కుళ్ళిపోయిన వాటిని పళ్ళని ఏరింది.

ఒక పక్కంతా పూర్తిగా కుళ్ళిపోయి, వాటి తొక్క నల్లగా ఉంది. వాటిని చేతుల్లోకి తీసుకుని చిరిగిపోయిన పైటతో అంటుకున్న బురదని, మట్టిని తుడిచింది. ముక్కు దగ్గర పెట్టుకుని వాసన చూసింది. చచ్చిపోయిన నమ్మకాల వాసన. వాటిని పైటలో దాచుకుని గబగబా గుడిసెల వేపొచ్చింది లచ్చి.

చుట్టూ చూసింది.

గుడిసెల దగ్గర కింకా ఎవరూ రాలేదు ఉయ్యాల్లో పిల్ల వేపు చూసింది. అదింకా కునుకుతూంది. సత్తు గ్లాసుతో నీళ్ళు తీసి ఆ బత్తాయి పళ్ళని కడిగింది. ఒకదాన్ని నోట్లో పెట్టుకుంది. అసహ్యంగా ఉంది వాసన. ఆకలి వాసనను లెక్క చెయ్యదు. రెండో పక్కనుంచి కుళ్ళిపోయిన తొనల్ని తింటూంది సరిగ్గా —

ఆ సమయంలో వచ్చాడు పెద్ద గుంటడు. లచ్చి పెద్ద కొడుకు వాడు. వాడికో పదేళ్ళుంటాయి. వాడి జుత్తు చిందర వందరగా ఉంది. వాడి చేతులు పొట్టిగా ఉన్నాయి. వాడి ముక్కు వలంగా ఉంది. వాడి కళ్ళు చిన్నవిగా ఉన్నాయి. వాడి గుండె అరుచుకు పోయి, ఎండిపోయిన మామిడిటెంకలా ఉంది. వాడి వళ్ళు నల్లగా ఉంది. వాడు ఉదయం నించి ఎండలో తిరగడం వలన వల్లటి వంటిమీద చెమట దట్టంగా జిగట కారుతూ ఉంది. వాడి మొలకో చిరిగిపోయిన నిక్కరు దేశంలో ప్రజాస్వామ్యంలా జారిపోతూంది. ఆ నిక్కరును నిలబెట్టలేని మొలతాడు మేధావిలా ఉంది.

ఆడు గబగబా తల్లి దగ్గర కొచ్చాడు. ఆడెవకాలం ఆడి చెల్లి ఎనిమిదేళ్ళది వచ్చింది. అది ఆడిలాగే ఉంది. కానీ దాని కాళ్ళకు ఆరేసి వేళ్ళున్నాయి. దాన్నెవరైనా చీకట్లో చూస్తే జడుపుతో జ్వరం పెట్టుకుంటారు.

పెద్దగుంటడు అనబడే లచ్చి కొడుకు తల్లి దగ్గరి కొచ్చి తల్లి చేతుల్లో ఉన్న బత్తాయి పండుని లాక్కొని ఆబగా తింటూ ఇలా అన్నాడు.

"సోలమ్మా! సోలమ్మా! ఆ నంజి కూతురు మాడే, నా కివ్వం దొరికితే. దొబ్బేసేవాది. నామా, అప్పల కొండ ఎల్లినావ్ బాపన వీదిలోకి. అక్కడిస్తళ్ళన్నీ ఏర్నాను. నామా, పెళ్లి ఇంటికి తెద్దామని మూట కట్టినానే. ఇంతిలో ఆనంజికూతురు. ఆ సైడి నంజి కూతురు. ఎక్కణ్ణుం చొచ్చిందో వాక్కుపోనాది. గబుక్కున పెల్లి సేతిలోంచి దొబ్బుకు పోనాది. నా నాద్దేను కానీ. తోసేసినాదే. లగెత్తినాదే న:జ. రానేదేటే." పెద్దగుంటడు చాలాఆయాసంతో కళ్ళు కాళ్ళూ ఎగరేస్తూ అక్కడ సైడి అనబడే సైడమ్మ వాళ్ళిద్దరి చేతుల్లోంచి ఎలా అన్నం పొట్లం లాగేసుకుందో చెప్పి సత్తు గ్లాసులోని నీళ్ళు గబగబా తాగుతున్నాడు. వాడి చెల్లి గ్లాసుని లాక్కొని అప్పలకొండకూడా తాగి—

"ఆకలేత్తందమ్మా." అని ఆ పక్కనున్న బత్తాయి పళ్ళు చూసి ఒకటి తీసుకుంది.

'అయితే పొద్దుటేల నించీ. ఏవీ తిన్నేదట్రా. అప్పలేవీ దొరికలేదా. ఎక్కడా?" .లచ్చి అడిగింది కొడుకునీ, కూతుర్నీ.

"తిండి దొరుకుద్ది గదాని ఆ యీధిలోనే ఉండిపోనాం."

"ఒక్క కాడే నవ్వడవేట్రా. దా నక్క డుంచి నువ్వు బొంకుల దిబ్బ కాడ కెలితేకాస్తబ్బు లొచ్చును గదరా." కోపంగా అంది లచ్చి.

వాళ్ళు మాట్లాడలేదు.

పెద్ద కొడుకు వేపు, కూతురు వేపు చూసి నిలవిల్లాడింది లచ్చి. అప్పుడామె తన ఆకలి మరచి పోయింది. పిల్లలు కడుపారా తిండి తిని ఎన్నాళ్ళయిందో. తల్లీ పిల్లలూ బజార్లో కెళ్ళి అడుక్కున్నా

కడుపులు నిండడం లేదు. కన్నందుకు వాళ్ళ ఆకల్ని తనెలా తీర్చగలదు. అడుక్కోవడం లోనూ పోటీలే.

లచ్చిమి వాళ్ళిద్దరి వేపూ ఒకసారి చూసింది. ఇద్దరి తలా నిమిరి వళ్ళో పడుకో బెట్టుకుంది. చెంపలన్నా, ముఖం నిమిరి ఇలా అంది.—

"ఒక్క పీటం ఓపిక పట్టండి. గుడ్డి సాయిగాడైనా, కుంటిరావులుగాడైనా. ఫకీరుగాడైనా. వస్తారు. ఏదైనా తెస్తారు. అడిగిస్తాను. కుసింత కునుకు తియ్యండి." వోదార్చింది.

పిల్లలు పలకలేదు.

ఎండ విరిగి ఉస్సగ ముఖం పట్టింది. రోడ్డు మీద మనుషులు తిరగడం మొదలైంది. చాలాసేపు రోడ్డు వేపు చూస్తూ కూర్చుంది లచ్చిమి.

ఇంతట్లో గుడ్డి సాయివు, ఫకీరుగాడూ ఒక్కసారి వచ్చారు. ఫకీరుగాడు గుడ్డి సాయివు కర్రని పట్టుకుని ముందున నడుస్తున్నాడు. ఇద్దరూ వాళ్ళ గుడిసె దగ్గర కొచ్చారు. వాళ్ళు రావడంతోనే లచ్చిమి లేచి, పడుకున్న పిల్లల తల్ని ఒడిలోంచి తీసి నేలమీద పెట్టి వాళ్ళ గుడిసె వేపు వెళ్ళింది.

"పిల్లలు ఆకలితో సొమ్మసిల్లి పోనారు. ఏదైనా ఉంటే ఇయ్యండ్రా." దీనంగా అడిగింది.

"ఏముంది. ఏవీనేదు మా కాడ. వూరంతా తిరిగినా రూపాయి డబ్బులు దక్కనేదు. దిక్కుమాలినోరు. వూటు మార్చియాలి. నాబం నేదు." ఫకీరుగాడు లచ్చిమి అడిగిందానికి జవాబుగా అన్నాడు.

"నేనే, లచ్చిమి. ఏవీనేదు. గుంటలు పైకెళ్ళినారు గావాల. ఏవీ తేనేదా." గుడ్డి సాయివు అడిగాడు.

"నేదు. పన్నం. దొరికినాదట గానీ, ఆ దరిద్రపు పైడిపంజ నాక్కుందట" అని గుడ్డి సాయివు చిరుగు పంచీ వేపు చూసింది. అందులో పైకి కనబడుతున్న రొట్టె ముక్క వేపు చూసింది. గుటుక్కున వంగొని పంచిలోది లాక్కు ఒక్క క్షణంలో తన గుడిసె వేపు పరుగెత్తింది.

"ఏటది. ఏటది." గుడ్డి సాయివు అరిచాడు.

"దొంగ నంజ... రొట్టె లాక్కుందిరా." ఫకీరు గాడు విసురుగా లేచాడు. లచ్చిమి వెనకాతల పరుగెత్తాడు. లచ్చిమి గబగబా పరుగెత్తుతూనే రొట్టెపైన ఉన్న మురుక్కాగితాన్ని చింపి, రొట్టెని నోట్లో పెట్టుకుని కొరికింది. దానెకాతల ఫకీరు గాడు పరుగెత్తి కెళ్ళి చెయ్యి పట్టుకున్నాడు.

"తిండి నేదురా. ఇంకొయ్యరా. ఉన్నియ్యరా." పిడికిట్లో గట్టిగా రొట్టెను పట్టుకుని అంది లచ్చిమి.

"మాకు తిండి నేదే." విసురుగా దాన్ని లాక్కోబోయాడు ఫకీరు. లచ్చిమి వెనక్కి దాచేసింది. దాని ఎడం చేతిని గట్టిగా పట్టుకుని కుడి చేతిలోని రొట్టెను లాక్కునే ప్రయత్నం చేస్తున్నాడు ఫకీరు. రొట్టెను గట్టిగా పట్టి, అణ్ణి గట్టిగా ముందుకి తోసేసింది లచ్చిమి. ఫకీరుగాడు ముందుకు పడబోయి నిలదొక్కుకుని, గట్టిగా దాని మొఖమ్మీద గుద్దాడు. అయినా లచ్చిమి పట్టు వదలలేదు. వాడు ఆ పెనుగులాటలో లచ్చిమి గుండెమీద చెయ్యి వేసి గట్టిగా ముందుకి తొయ్యబోయాడు.

అప్పుడు లచ్చిమి ఇలా అంది.

"ఒరేయ్ ఫకీరు! అటు వేపు సూడు. దానేపు సూడు. తిండి నేక సొమ్మసిల్లి పోనారు. ఆ లేవ్రా. నా పిల్లలు. అడేపు సూడు. ఆ పెద్ద గుంటడు. అదు ఆకలో... ఆకలో అని అరిచి పడి పోనాడు. ఆ దెవడ్రా. నీకు బుట్టినోడు కాదూ. ఒరే ఫకీరుగా! అడి కెట్టడానికేరా. నా క్కాదరా. ఇయ్యరా." మీద మీదకొస్తున్న అడితో తల్లిగా దయనీయంగా అడిగింది లచ్చిమి. ఆ మాటలు వాడి మీద ఏ మాత్రం పని చెయ్యలేదు.

ఫకీరుగాడు ఇలా అన్నాడు.

"ఒసెర్రి లచ్చీ! నాను నక్కతొంబయి మంది కాడ తొంగున్నాను. తొంగున్న పెతీవంటాకి పుట్టిన పెతీ గుటుకి నానే బాబు నేటి. అదెలా గొడ్డి. అలాగే ఉండూనా. నువ్వు... పోయిన నీ మొగుడూ కాడ తొంగున్నావు. నా కాడా తొంగున్నావు. సాయిగాడి కాడా తొంగున్నావు. కాళ్ళు లేని ఆ రాములుగాడి కాడా తొంగున్నావు. ఎవలు తొంగోమన్నారు? గాలికి బుట్టిన ఎదవలు. గాలికే పోతారు. నీ యాక లేద నువ్వు కానుకో." నీతిబోధ చేశాడు ఫకీరు.

"మొగుడు వచ్చిన మూడ్రోజుల నాడే కష్టాలు తీరుతాయని కనికారం చూపించి కక్కుర్తి పడి మోసం చేసిన నా కొడుకుల్లో నువ్వూ ఒకడివిరా, ఫకీరు వచ్చినోడా, మర్చిపోనావేటి?" బాధ పడుకొని అంది లచ్చి.

దానికేం మాట్లాడలేదు ఫకీరుగాడు.

"ఇచ్చి. రొట్టిచ్చి. గుడ్డిగాడి దగ్గర నాను కొట్టేర్దామనుకుంటే. నువ్వు తయారయావేటి." విసురుగా లాగాడు. సగం రొట్టె ముక్క ఫకీరుగాడి చేతిలోకి వచ్చేసింది.

"ఇది నాను ఉంచీసుకుంటాను. ఒగ్గిరా." సగం రొట్టె ముక్క వేపు చూస్తూ అన్నది లచ్చిమి.

"శ్రతి కొత్తావా." లచ్చిమి మాట్లాడలేదు. వాడు దుబల్పాజీ నవ్వు నవ్వాడు. లచ్చిమి వాడి వేపు కాని, వాడి నవ్వు వేపుగాని చూడలేదు. చేతిలో రొట్టెముక్కని నోట్లో పెట్టుకుని సగం కొరికి మిగతా సగం పిల్లలకు పెడదామని ముందుకి నడిచింది.

అంతట్లో ఉయ్యాల్లో పిల్ల ఏడుపు వినబడింది. దాన్ని వళ్ళోకి తీసి, పాలుతాగిస్తూ కొడుకుని, కూతుర్ని లేపి రొట్టెముక్కని పెట్టింది.

"మరి నేనేటి." పెద్ద గుంటడు అడిగాడు

"నేదురా" అని ఇంకేదో చెప్పబోయి ఆగిపోయి. రోడ్డు వేపు చూసింది లచ్చిమి.

గుడిసెల పక్క నించి వయ్యారంగా నడుచు కొస్తున్న పైడమ్మ వేపు చూసింది లచ్చిమి.

వెల్తురింకా పోలేదు. వేపాల చాటునుంచి పీటార్పుగా పడుతున్న సూర్యుడు ఎర్రగా, ఎర్రెర్రగా పురిటి కందులా ఉన్నాడు. ఒక పక్క ఆకాశం గర్భస్రావం అయినట్టుగా అసహ్యంగా ఉంది. ఇంకో పక్క కమ్ముకొస్తున్న చీకటి దరిద్రంలా ఉంది.


పైడమ్మ బాగోదు. పైడమ్మ పొట్టిగా గిడసలా ఉంటుంది. అదిప్పుడు రంగు వెలిసి పోయిన సిల్కు చీరతోను, చిరుగులు కనపడని జాకెట్టుతోనూ ఉంది. దాని జుట్టు పొడవుగా ఉండదు. అయినా జడ వేసుకుని ప్లాస్టిక్ పువ్వుని తగిలించుకుంది. ముఖానికి పెట్టుకున్న కుంకుమ బొట్టు సగం చెరిగి పోయింది. పైడమ్మ పుష్టిగా ఉంది. అందం లేకపోయినా, వయసే అందంగా ఉంది. ఫకీరుగాడి మాటల్లో చెప్పుకోవాలంటే—"దానందం. కుండల్లాంటి గుండెల్లోనూ, డేగిసాల్లాంటి పిర్రల్లోనూ ఉంది." అందుకే పైడమ్మ దగ్గర రోజంతా డబ్బు లేకపోయినా, రాత్రయ్యేసరికి రూపాయలు డబ్బు లుంటాయి.

పైడమ్మ చేతిలో విస్తరాకు పొట్లం ఉంది. అది పట్టుకుని వస్తూ గుడ్డి సాయిని, ఫకీరుని పలకరించి తన గుడిసె దగ్గర కొచ్చి నులక మంచం మీద కూర్చోబోయింది.

ఆ సమయంలో లచ్చిమి పరుగు లాంటి నడకతో పైడమ్మ దగ్గర కెళ్ళి, దాని చేతిలో వున్న పొట్లాన్ని లాక్కుంది.

"ఏడే వస్తి! గుంటల దగ్గర దొబ్బడానికి సిగ్గు నేదు" అని వెనక్కి తిరిగింది లచ్చిమి. పైడమ్మ ముందుకి అడుగేసి లచ్చిమికి అడ్డంగా నిలబడింది.

మునసోబుని, కరణాన్ని, పెసిడెంటుని తీసేశారు గందా! మరిప్పుడు గ్రామాల్లో, పల్లెటూళ్ళలో విలన్లగా ఎవుర్ని పెట్టాలంటావ్ డైరెక్ట్రూ?!



"పొట్లాం మర్యాద గిప్పి. అది నాను కొను క్కుంది. గుంటలకాడ నా వేం నాక్కోవేదు." లచ్చి చేతిలో పొట్లాన్ని లాక్కుంది పైడమ్మ.

"నా పిల్ల తల్లి కాదకి మర్చేందు [illegible]క్కావ్, నంజా! మర్యాద గిప్పి, నేకపోతే. పేగులు పుటుక్కున కొరికేత్తాను." కోపంగన్నాది లచ్చి.

"కొరుకు సూత్తాను. పళ్ళు పులుపెక్కి పోయ్యాలు గావాల. ఒళ్ళూ బలుపెక్కి పోవాది గావాల. హో. హో. నా విస్వను. ఎలా నాక్కుంటావో నాక్కో మూత్తాను." పైడమ్మ గిలగా అంది.

"ఎలా నాక్కుంటావా భాగే" పైడమ్మ చేతిని గట్టిగా పట్టి లాగింది లచ్చి. పైడమ్మ వదల్లేదు. పైడమ్మ చేతుల్ని కరవడానికి ప్రయత్నం చేసింది.

లచ్చికి రెండ్రోజుల్నించి అసలు తిండి లేకపోవడం వలన నీరసంగా ప్రాణాలు కడట్టుకు పోతు నట్టుగా ఉన్నాయి. అయినా తిండిని దక్కించుకోవాలనే ప్రయత్నంలో పరంలా పోరుతూంది.

పైడమ్మ పుష్టిగా బలంగా ఉండటం వలన అది గబుక్కున లచ్చిని ముందుకు తోసేసి గుడిసె ఎనక్కి పారిపోయింది.

"ఆగే నంజా! పైసాకు పడుకునే నంజకి పిల్ల లాకలి ఏటి తెలుత్తాదే. గుంటలు సంపాదించుకున్న తిండటే. దిక్కుమాలిన పాపు నత్తావ్. అమ్మోరు తల్లి. దయసూడే. ఆ నంజకి దిప పెట్టేయ్. ఆ సంజని వల్లకాట్లో కలిపేయ్. సం. జా. నా పిల్లలుసురు, నా ఉసురు తగులుత్తాదే. కడుపు కూడు కొట్టేసిన నంజకి కడుపు తీపి తెలుత్తాదేటి." నోటి కొచ్చినట్టుగా తిడుతూ పరుగెడుతూంది లచ్చి.

"ఏటున్నావ్. అవునే. నేనే ఏసాకిసాను. నేనే. నా నాదాలింగ పేటకాడా నేనే. అంబటి సత్రం కాడా నేనే. యూసవ్వారాయణ గుట్టల్లోనూ. నేనే. అయోధ్య మైదానం. గుడిసెల్లోనూ నేనే. ముగ్గుర గుంటలకి తండ్రెవరో చెప్పు. ఒక్క పిండానికి పదేసి తాళాలే. సిగ్గు లేకపోతే సరి." పైడమ్మ లచ్చి జుత్తు పట్టుకుని గుంజి వెనక్కి తోసేసింది. లచ్చి దబ్బున కింద పడిపోయింది. పడిపోయిన లచ్చి విసురుగా ఏడుస్తూ లేచింది.

"హోరి పకీరు! ఒరి గుడ్డి నా కొడకా! ఒరి కుంటి దవా! నా పిల్లలకు తండ్రు లెవరో చెప్పండ్రా. దిక్కుమాలిన నా కొడుకుల్లారా! తాగేసి ఉపభోగం చేసి కోడం కాద్రా. చెప్పండ్రా. నా బతుకును బుగ్గి చేసిన ఎదవల్లారా! చెప్పండ్రా. నవ్వన్నాయం చేసిన గాడిద కొడుకుల్లారా! చెప్పండ్రా. కుక్క నా కొడుకుల్లారా! చెప్పండ్రా. చెప్పండి." గుడ్డి సాయీ గాడి వేపు, పకీరుగాడి వేపు చూస్తూ అరిచింది లచ్చి.

ఈ దృశ్యాన్ని చూడలేక సూర్యుడు తల వంచుకుని వెళ్ళిపోయాడు. మున్సిపాలిటీ వాళ్ళ లైట్ల వెలుతురు పూరిలోని పాపన్ని కప్పి పుచ్చడానికి ప్రయత్నం చేస్తూంది. ఆ సమయంలో అక్కడికి తాలాకుంది ముష్టి లోకం వచ్చి చేరింది. ఆ రగడని వేడుకగా చూస్తున్నారు.

లచ్చి అడిగిన ప్రశ్నకు జవాబు ఎవరూ చెప్ప లేదు. ఇంటట్లో దెబ్బలాటకు, తిట్ల శబ్దానికి లేచిన లచ్చి పిల్లలు పరుగు పరుగున వచ్చి—'నాదీ అన్నం. ఇచ్చెయ్యే." అని పైడమ్మ మీద పడి లాక్కోడానికి ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ళను తోసేసింది పైడమ్మ. ఆ పిల్ల లిద్దరూ దబేలున కింద పడి పోయి, లేచి భోరున ఏడుస్తున్నారు.



ఫోటో: సుధాకర్, యడవల్లి

"నా పిల్లల్ని తొయ్యడానికి నీ కెన్ని గుండెలే ..." అని లచ్చి పైడమ్మ మీద పడింది. పైడమ్మను ఇష్టమొచ్చినట్టుగా కొట్టి, పిడిగుద్దులు గుద్ది నేల మీద పడదోసి, అది లేచే లోపుగానే దాని చేతిలోంచి అన్నం పొట్లాన్ని వేర్పరితనంగా లాక్కుని ఇద్దరి పిల్లల్ని ఈడ్చుకుని వచ్చి లైటు స్తంభం కింద కూర్చోబెట్టి వాళ్ళ చేతిలో ఆ పొట్లాన్ని పెట్టి మళ్ళీ పైడమ్మ దగ్గర కెళ్ళింది లచ్చి.

పిల్లలిద్దరూ ఆ పొట్లాన్ని విప్పారు. పొట్లంలో అన్నం వెచ్చగా ఉంది. పులుసు కూర అక్కడక్కడ ముక్కలు, కలిసిపోయిన మజ్జిగతో అది వోరా రించే వాసన వేస్తోంది. ఇద్దరూ ముద్దలు తీసుకుని నోట్లో పెట్టుకున్నారు.

సరిగ్గా ఆ సమయంలో వెర్రెపని పరుగెత్తు కొచ్చిన పైడమ్మ గెద్దలా దాన్ని ముందుకు లాగేసింది. ఆ విసురుకు విస్తరాకు చిరిగిపోయింది. ఆ అన్న మంతా మట్టిలో పడిపోయింది. పిల్లలిద్దరూ ఆ మట్టిలో కలిసిపోయిన అన్నాన్నే ముద్దలు చేసుకో డానికి ప్రయత్నం చేస్తున్నారు.

"చూసినారా! పిల్లలు తింటున్న నోటి కాడ కూడుని ఎలా లాగేసిందో . నా పిల్లల కడుపు కొట్టావు. నీ కడుపూ అనాగే ఎవడో కొడతాడే. ఛీ..." ఏడుస్తూ పిల్లల దగ్గరకొచ్చి నేల మీద అన్నాన్ని ఏరబోయింది లచ్చి. కాని మెతుకులన్నీ మట్టిలో కల్సి మట్టిగడ్డల్లా కనిపిస్తున్నాయి. ఆ మట్టి గడ్డల్నే ఏరింది. చిరిగిపోయిన విస్తరాకులో వెయ్య టానికి ప్రయత్నించింది.

కాని వీలుపడలేదు. అలాగే ఆ మట్టి మెతుకు లన్నిటినీ ఏరి విస్తరాకులో పెట్టి కుండ దగ్గరకెళ్ళి గ్లాసుతో నీళ్ళు తీసి. ఆ అన్నాన్ని కడిగి, నీటి నంతటినీ పిండి, ఆ తడితడి మెతుకుల్ని వాళ్ళిద్దరికీ ముద్దలుగా చేసి తినిపిస్తోంది. తినిపిస్తూ పైడ మ్మను తిడుతోంది. తన దిక్కుమాలిన స్థితిని తల్చుకుని ఏడుస్తోంది. ఆ ముష్టి గూడెంలో ఉన్న [illegible]వాళ్ళందర్నీ పేరు పేరునా తిట్టి ఏడు స్తోంది.

ఆ గూడెంలో జనం ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. లక్ష్మిని ఎవరూ పట్టించుకోలేదు.

సమయం ఎంతయిందో తెలీదు. రోడ్డు మీద మనుషుల అలికిడి తగ్గింది. ఆకలి తీరని పిల్లలు చాలాసేపు తల్లిని 'అమ్మా ... ఆకలే ... ఆక లేస్తోందే" అని అడిగి అడిగి సొమ్మసిల్లి పడిపోయారు. ఎప్పుడు లేచిందో వుయ్యాల్లో పిల్ల ఏడుస్తోంది. పరాలన్నిటినీ కూడదీసుకుని ఏడుస్తోంది. ఆ పిల్లని తియ్యలేదు లచ్చి. అలా వెక్కుతూ, వెక్కుతూ ఏడవడం లచ్చికి వినబడుతోంది.

లచ్చి ఒక్కసారి లేచింది. గబుక్కున గోడ దగ్గరి కెళ్ళి తల బాదుకోవడం ప్రారంభించింది. ఆమె నుదురు చిట్లి కారుతున్న రక్తం రక్తంలా లేదు. బాత్తు పీక్కుని ఆ ముష్టిలోకం అంతా కదిలిపోయి నట్టుగా ఏడ్చింది. దేవుడనేవాడుంటే వాడు కరిగి కన్నీరై పోయేటట్టుగా ఏడ్చింది. కడుపులో సమ్మెట పోటులా భయంకరంగా బాధపెట్టే ఆకలి బాధను భరించలేక లచ్చి చాలాసేపు నేల మీద పొర్లి పొర్లి ఏడ్చింది.

ఆ తర్వాత—

కొంతసేపటికి లచ్చి లేచి నిలబడింది. ఉయ్యా ల్లోని పసి కందుని రెండు చేతుల్లోకి తీసుకుంది. గబగబా ముందుకి నడిచింది. గుడిసెల ముందు అందరూ నిద్రపోతున్నారు. ఎక్కడనుంచో మను షుల మాటలు చిన్నగా వినబడుతున్నాయి.

గుడిసెలుదాటి, రైల్వే స్టేషన్ రోడ్డు దాటి ముందుకు నడిచింది. అక్కడ పార్కు పక్కన మున్సి పాలిటీ లైటు కింద నలుగు[illegible]సెలు పులిజూదం ఆడుతున్నారు. అక్కడకు వెళ్ళి నిలబడింది లక్ష్మి.

ఆ అడుగుల చప్పుడికి ఆ నలుగురూ తల తిప్పి చూశారు.

"ఒచ్చావా ... నేను చెబితే ... ఇన్నావు...కావు... ఇప్పుడైనా తెల్సుకున్నావా ..." కుంటి రావులు కర్ర సర్దుకుని లేచాడు.

"ఎంతిస్తావు?" లచ్చి అడిగింది.

"మొదట్నించీ నా మాట పాతికే ..." లచ్చి ఏదో చెప్పబోయింది. ఎందువలనో ఆగిపోయింది.

"తీసుకోరా" కుంటి రావులు పక్కనున్న ఇంకొ కడు లేచి లచ్చి చేతిలో ఉన్న పిల్లని అందుకున్నాడు. కుంటి రావులు రెండు పదులు, ఒక ఐదు తీసి లచ్చి చేతిలో పెట్టాడు.

"నీ పిల్లకూ, నీకూ రుణం తీరిపోవాది ... అరద మైందా?"

లచ్చి తలూపింది. ముందుకి ఒకడుగు వేసింది. అడుగు పడలేదు. ఒక్కసారి పిల్లముఖంవేపు చూసి గబగబా ముందుకి నడిచింది.

ఆ రాత్రి లచ్చి జీవితంలో మొట్టమొదటిసారిగా కడుపు నిండా అన్నం తిన్నాది.

★